క్లుప్తంగా

ప్రకృతి ఒడిలో సంగీతం ఉద్భవం



సూర్యకుమారి, రామనాథం దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: సంగీతం ప్రకృతి ఒడిలో ఉద్భవించిందని ప్రముఖ సంగీత విద్వాంసురాలు చావలి సూర్యకుమారి అన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శనివారం ప్రపంచ సంగీత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి, రామనాథం దంపతులను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ, భారతీయ సంగీతానికి వేలాది సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. సంగీత స్వరమే జీవమని, సంగీతం మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని చెప్పారు. మానసిక ఆనందానికి, ఉత్సాహానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, డాక్టర్ రాఘవేంద్రరావు, దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్: ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని జి.కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం రక్తదాన శిబిరం జరిగింది. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా పంతం నానాజీ ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



కరప పంచాయతీ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న డిప్యూటీ ఎంపీడీఓ

కరప: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాగునీటిని వృథా చేయరాదని, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటాలన్నారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు.

ఇండియన్ క్రిస్టియన్ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విలియమ్స్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలోని కచేరిపేటలో ఉన్న రూపాంతర మహిమ, బైబిల్ మిషన్ దేవాలయం ఆధ్వర్యంలో రెవ ఎన్‌జే శామ్యూల్ పర్యవేక్షణలో జూలై 3న కాకినాడలో జరిగే ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం దేవాలయం ఆవరణలో జరిగింది. రెవ డా ఎంఎస్ విలియమ్స్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా, బిషప్ జోసఫ్ బెన్ని అధ్యక్షత వహించారు. ఏఐసీసీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి రెవ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్, ఏఐసీసీ కమిటీ సభ్యులు ప్రసన్నకుమార్, డేవిడ్ శామ్యూల్ పాల్గొన్నారు.

ప్రజా కళలకు సారథి యాసలపు

పెద్దాపురం: సమాజానికి దిశా నిర్దేశం చూపే ప్రజా కళలకు సారథి లాంటి వ్యక్తి యాసలపు సూర్యారావు అని చంద్రమాంపల్లి స్నేహ ఆర్ట్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేశి రాజా అన్నారు. కార్మిక నేత యాసలపు సూర్యారావు వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని సూర్యారావు భవనం వద్ద శనివారం రొంగల వీర్రాజు అధ్యక్షతన కళాకారుల శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, జానపద కళారూపాల పరిరక్షణ కోసం, ప్రజా సమస్యలపై కళాకారులను తయారు చేయడంలో సూర్యారావు ముందుండేవారన్నారు. కొత్త కళారూపాలను తయారు చేయడానికి కృషి చేస్తున్న ప్రజా నాట్య మండలిని అభినందించారు. పార్టీలకతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సూర్యారావు చూపిన చొరవ మరువలేనిదని కొనియాడారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, యువతలో స్ఫూర్తి రగిల్చిన నాయకుడు సూర్యారావు అన్నారు. తొలుత సూర్యారావు చిత్రపటానికి పూలమాలల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలు జానపద కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ శాఖ కార్యదర్శి కేదారి నాగు, పీఎస్ఎం మండల అధ్యక్షులు మంతెన సత్తిబాబు, దారపురెడ్డి సత్యన్నారాయణ, కృష్ణ, మాగాపు నాగు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ స్పీడ్ బ్రేకర్లు

- రోడ్లపైనే పశువుల సంచారం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం



విద్యుత్ నగర్ ఐడియల్ కళాశాల ప్రధాన రహదారిలో పశువుల మంద

బోట్‌క్లబ్: ఒకటి కాదు.. రెండు కాదు.. పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై నిత్యం సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నడిరోడ్డుపైనే అవి మకాం పెట్టడంతో నిత్యం వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వేళాపాళా లేకుండా ఇవి రోడ్డుపైనే తిష్ట వేయడంతో.. అటుగా ప్రయాణించే వారు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. కాకినాడ నగరంలో సుమారు 5 లక్షల మంది నివసిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ వివిధ పనులపై ప్రజలు ఆయా ప్రాంతాల్లో ప్రయాణిస్తుంటారు. స్మార్ట్ సిటీ పుణ్యమా అని రోడ్లు కాస్త సక్రమంగా ఉన్నా.. పశువుల కారణంగా నిశ్చింతగా వెళ్లే వీల్లేకుండా పోయింది. నిత్యం ఏదొక వీధిలో ఈ పశువులు మకాం వేయడం.. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడడం నిత్యకృత్యంగా మారింది. ప్రధాన కూడళ్లయిన భానుగుడి సెంటర్‌తో పాటు, శివారు ప్రాంతాలైన ఎల్‌బీ నగర్, విద్యుత్‌నగర్ తదితర చోట్ల పశువుల సంచారం రోజురోజుకూ పెరిగిపోతోంది.

పోట్లాటకు దిగితే..

రోడ్డుపై సంచరిస్తున్న పశువులు కొన్ని ఆకస్మికంగా వాటిలో అవే పోట్లాడుకుంటూ.. అటుగా వెళ్లే వాహనదారులపై పడుతున్నాయి. ఈ క్రమంలో వాహనాలకు నష్టం వాటిల్లడమే కాకుండా, వాహనదారులు గాయాల పాలయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల విద్యుత్‌నగర్ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కాలేజీకి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అప్పటివరకు రోడ్డుపై పడుకుని ఉన్న ఆవులు ఒక్కసారిగా గుంపులుగా లేచి విద్యార్థుల ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడి, గాయాల పాలయ్యారు. నిత్యం ఇలా ప్రమాదాలు బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటుంది.

కానరాని మార్పు

రోడ్డుపైన పశువులు వదిలితే చర్యలు తప్పవని కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు స్పష్టం చేసినా పశువుల యజమానుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పశువులను పట్టుకుంటే మాత్రం, ఈసారి ఇలా జరగకుండా చూసుకుంటామని ఆ రోజుకు వారి పశువులను తీసుకెళ్లుతున్నారు. మరుసటి రోజు షరామామూలే అన్నట్టుగా మళ్లీ పశువులను రోడ్డుపైనే వదిలేస్తున్నారు.



ఎల్‌బీనగర్-జేఎన్‌టీయూకే ప్రధాన రహదారిలో పశువుల తిష్ట

మొక్కలకు నష్టం

కార్పొరేషన్ అధికారులతో పాటు, స్వచ్ఛంద సంస్థలు కాకినాడ నగరంలో భారీగా మొక్కలను పెంచుతుంటే పశువులు వాటిని తినేస్తున్నాయి. ఏపుగా పెరుగుతున్న సమయంలో వాటిని తినేయడంతో మొక్కలు చనిపోతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో ఇలా పశువులు మొక్కలు తింటూనే దర్శనమిస్తున్నాయి. ఇంటి సమీపంలో పెంచుకుంటున్న మొక్కలు సైతం పశువులు తినేస్తున్నాయి. అపార్ట్‌మెంట్లలో సైతం చొరబడి మొక్కలను తినేయడంతో, అపార్ట్‌మెంట్‌వాసులు ఈ పశువులను ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



ప్రతి రోజు ఐడియల్ కళాశాలకు విద్యుత్‌నగర్ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తుంటాం. ఒక్కొక్కసారి నాన్సీ స్ట్రీట్‌లో ప్రయాణిస్తుంటాం. ఈ రెండు రహదారుల్లోను ఏదోక ప్రాంతంలో తప్పనిసరిగా పశువులు సంచరిస్తుంటాయి. వీటితో చాలా ఇబ్బందిగా ఉంటుంది. ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా భయంభయంగా ఉంటోంది.

– కె.సాయి, విద్యార్థి

రహదార్లపై అడ్డంకిగా..



విద్యార్థులను నేను ఆటోలో కళాశాలలకు తీసుకుని వెళుతుంటాను. నిత్యం ఏదొక రోడ్డుపై ఈ పశువులు దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్కసారి రోడ్డుపై ఆటో కూడా వెళ్లే వీల్లేకుండా అడ్డంకిగా ఉంటున్నాయి. దీంతో వాటిని చెదరగొట్టి రోడ్డుపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి.కృష్ణ, ఆటోడ్రైవర్

సంగీతంతో రుగ్మతల నియంత్రణ



సతీష్‌ను సత్కరిస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: జీవితంతో సంగీతానికి విడదీయరాని బంధం ఉందని, సంగీతానికి ఏదైనా సాధించగల సామర్థ్యం ఉందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా గంగాధరం ఆర్కెస్ట్రా అధినేత పెదిరెడ్డి సతీష్‌ని ఘనంగా సత్కరించారు. సంగీతం ఒక కళా చికిత్సగా కూడా ఉపయోగించబడుతుందని, ఇది ఆందోళన, నిరాశ, గాయం, సైకోసిస్, ఒత్తిడి వంటి వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వివరించారు. సంగీతం వినడం వల్ల ఆందోళన, రక్తపోటు తగ్గుతాయని, నిద్ర నాణ్యత, మానసిక స్థితి, జ్ఞాపకశక్తి మెరుగుపడతాయని పరిశోధనల్లో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ కళాకారుడు బొట్టా అనిల్ మాట్లాడారు. సంఘ సభ్యులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు



కర్రి ఆదినారాయణ(ఫైల్)

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కాకినాడ ఏటిమొగకు చెందిన కర్రి ఆదినారాయణ(38) ఈ నెల 16వ తేదీన జగన్నాథపురం వంతెన నుంచి మరి కొంతమందితో కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. మూడు రోజుల పాటు వేట కొనసాగించి తిరిగి ఇంటికి చేరనున్న తరుణంలో వేసిన వలను లాగే ప్రయత్నం చేశాడు. అలా లాగుతుండగా హోప్ ఐలాండ్ సమీపంలో అదుపుతప్పి సముద్రంలోకి జారి పడిపోయాడు. సహ మత్స్యకారులు వలలు వేసి, మరో నాలుగు బోట్లలో గాలించినా ఆదినారాయణ జాడ కానరాలేదు. దీంతో శనివారం రాత్రి ఆదినారాయణ సోదరుడు కర్రి నాగూర్ ఫిర్యాదుతో కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ అల్యూమినియం కంపెనీ ఈ సెలెక్షన్స్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన 20 మందితో పాటు, ఇతర కళాశాలల విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన వారిని చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి అభినందించారు.

సమస్యలకు యోగా పరిష్కారం



కాకినాడ యాంకరేజ్ పోర్టులో..



కరప మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగాసనాలు వేయిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ



కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



జేఎన్‌టీయూకేలో యోగాసనాలు వేస్తున్న ప్రముఖులు

కరప: ఒత్తిడిని అధిగమించేందుకు, అనేక సమస్యలను నయం చేయగల మహత్తర శక్తి యోగాకు ఉందని ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యోగాతో మానసిక ప్రశాంతత చేకూరి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. యండమూరులో సర్పంచ్ మార్రెళ్ల శివ, ఉప సర్పంచ్ పలివెల జానకిరామయ్య, కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందం యోగాపై అవగాహన కల్పించారు. పెనుగుదురులోని స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో ఇంటర్నేషనల్ యోగా డే నిర్వహించారు.

కాకినాడ రూరల్: యోగా డే సందర్భంగా స్థానిక రమణయ్యపేటలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో పోలీసు సిబ్బంది యోగాసనాలు వేశారు. అసిస్టెంట్ కమాండెంట్ మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

18వ బెటాలియన్ ఆధ్వర్యంలో..

సూర్యారావుపేట బీచ్‌లో ఎన్‌సీసీ కాకినాడ 18వ బెటాలియన్ ఆధ్వర్యంలో 450 మంది యోగా డేలో పాల్గొన్నారు. అచ్చంపేట జంక్షన్ మెడికవర్ ఆస్పత్రిలో యోగా డే కార్యక్రమం జరిగింది. వలసపాకలలో కోరమాండల్ కల్యాణ మండపంలో జరిగిన యోగా డేలో ఎంపీడీఓ పి.సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు, కోరమాండల్ సీఎస్ఆర్ ఇన్‌చార్జి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అచ్చంపేట జంక్షన్‌లోని ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి అధ్యక్షతన, యోగా గురువు రామ్ గోపాల్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ ఉద్యానవనంలో యోగా డే నిర్వహించారు. శుభానికేతన్ విద్యార్థులు యోగా ఆసనాలపై నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు ప్రాంగణంలో యోగా డే ఘనంగా నిర్వహించారు. పోర్టు ఆఫీసరు ధర్మశాస్త్ర ఆధ్వర్యంలో పోర్టు ఉద్యోగులు, ఎస్పీఎఫ్ సిబ్బంది యోగాసనాలు వేశారు. ఎస్పీఎఫ్ డీఎస్పీ బత్తుల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలో పలు విద్యాసంస్థలు, కళాశాలలు, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో యోగా డే ఘనంగా నిర్వహించారు. స్థానిక సురేష్ నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. స్థానిక రామారావుపేట నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ షర్మిల ఆధ్వర్యంలో యోగా డే ఘనంగా నిర్వహించారు.

స్థానిక లక్ష్మీనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా డే జరిగింది. పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు యోగా ప్రయోజనాలు వివరించారు. యోగా గురువు లక్ష్మణ్, జగదాంబను సత్కరించారు. జేఎన్‌టీయూకే పరిపాలనా భవన్ ఎదురుగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా డే జరిగింది. ఉప కులపతి ప్రొఫెసర్ సీఆర్‌కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

బోట్‌క్లబ్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భాష్యం స్కూల్స్ జోనల్ ఇన్‌చార్జ్ వి.గోవిందరాజులు అన్నారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

భూగర్భ జలాలు పొదుపు చేయాలి



జీజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పాటు నీరు–మీరు కార్యక్రమం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ, భవిష్యత్ తరాల భద్రత కోసం భూగర్భ జలాలు పొదుపు చేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అలాగే కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జల, వన సంరక్షణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మితిమీరుతున్న తాగుబోతుల ఆగడాలు



సిరిపురంలో దమ్ము చేస్తుండగా డ్రైవర్‌కు దొరికిన మద్యం సీసా

కరప: గ్రామాల్లోని తాగుబోతుల ఆగడాలు రైతులకు అపాయకరంగా మారుతున్నాయి. మందుబాబులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు పడేస్తున్నారు. దీంతో గ్రామ శివార్లు, లేఅవుట్లు, పొలం గట్లు, పొలాల్లో చెత్తాచెదారం, పగిలిన సీసాలు దర్శనమిస్తున్నాయి. పొలాల్లో, పంట కాలువల్లో మద్యం బాటిళ్లు ఇష్టానుసారంగా పడవేయడంతో కూలీలకు, రైతులకు గాయాలై, ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లోని కొన్ని కిళ్లీషాపులు, కిరాణా దుకాణాల్లోనే బెల్టు షాపులు నిర్వహిస్తుండటంతో మద్యం ఏరులై పారుతోంది. మందుబాబులు విహారయాత్రకు వచ్చినట్టు పొలాల్లోకి వెళ్లి, మద్యం సేవించి.. సీసాలు, గ్లాసులు పడేస్తున్నారు. కాలువల తవ్వకం పనులకు వెళ్లినప్పుడు కూలీలకు, దమ్ములు చేసేటప్పుడు ట్రాక్టర్ డ్రైవర్లకు, గట్టు లంకలు వేసేటప్పుడు రైతులకు గాయాలవుతున్నట్టు చెబుతున్నారు. గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి, పొలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రిపేరు లేని జీవితాలు

- ప్రోత్సాహం కరవైన మెకానిక్‌లు
- మరుగున పడే స్థితిలో మెకానిక్ షాపులు
- హెల్పర్లు దొరక్క ఇబ్బందులు
- వృద్ధాప్యంతో పని చేయలేని దుస్థితి



మోటార్ సైకిల్ రిపేర్ చేస్తున్న మెకానిక్

సామర్లకోట: రోజురోజుకూ మోటార్ సైకిళ్ల వాడకం పెరుగుతుండగా.. వాటికి మరమ్మతులు చేసే మెకానిక్‌ల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. రెండు దశాబ్దాల క్రితం మోటార్ సైకిళ్ల మెకానిక్‌లకు మంచి డిమాండ్ ఉండేది. దాంతో ఆర్థికంగా వెనుకబడిన వారు తమ పిల్లలను మోటార్ సైకిలు మెకానిక్ వృత్తికి పంపేవారు. వారికి 20 ఏళ్లు వచ్చే నాటికి మంచి మెకానిక్‌గా తయారయ్యేవారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను కఠినంగా అమలు చేయడంతో.. మెకానిక్ షాపుల్లో తక్కువ వయసు వారిని పెట్టుకోవడానికి భయపడుతున్నారు. దీనికితోడు మెకానిక్ వృత్తిలోకి పిల్లలను పంపడానికి తల్లిదండ్రుల్లో ఆసక్తి తగ్గడం, ప్రభుత్వ స్కూళ్లలోనూ మంచి చదువు అందుబాటులో ఉండడం తదితర కారణాలతో ఈ వృత్తికి ఆదరణ తగ్గింది. ఈ నేపథ్యంలోనే అందుబాటులో ఉన్న మెకానిక్‌లే షాపులను నిర్వహిస్తున్నారు.


చేతనైనంత వరకు..

మండలంలో సుమారు 70 మోటార్ సైకిలు మెకానిక్ షాపులున్నాయి. వీటిలో 20 షాపుల్లో మాత్రమే హెల్పర్లు ఉన్నారు. మిగిలిన షాపుల్లో యజమానులే అన్ని పనులు చేసుకుంటున్నారు. ఈ 50 మందిలోను 30 మంది వరకు 50 ఏళ్లు దాటిన వారే అధికంగా ఉన్నారు. కొంతమంది 60 ఏళ్లు పైబడినా.. మరో వృత్తికి వెళ్లలేక చేతనైనంత పనులు చేసుకుంటున్నారు. మోటార్ సైకిలు మెకానిక్‌లంటే పలు రకాలుగా శారీరక శ్రమతో పనులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 60 ఏళ్లు దాటిన వారు ఆ మేరకు మెకానిక్ పనులు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

మూతపడితే..

మోటార్ సైకిలు మెకానిక్ వృత్తిని నేర్చుకునే వారు కానరాకపోవడంతో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న షాపులు మూతపడితే, ఆయా మోటార్ సైకిళ్ల సర్వీసు సెంటర్లకే వెళ్లి మరమ్మతులు చేయించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. బాల కార్మిక నిర్మూలన వ్యవస్థ కారణంగా మెకానిక్ పనులు నేర్చుకోవాలని కొందరు ఆసక్తి చూపుతున్నా, నేర్పలేకపోతున్నామని మెకానిక్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్లు దాటిన వారికి పని చెప్పినా.. పెడచెవిన పెట్టడంతో వృత్తిలో రాణించలేకపోతున్నారని అంటున్నారు. కొంత కాలానికి మోటార్ సైకిళ్లను నిర్ణీత కాలపరిమితి దాటితే మూలన పడవేయాల్సిన పరిస్థితులు రావచ్చని విశ్లేషిస్తున్నారు.

వృత్తి శిక్షణ ఇవ్వాలి



ఇప్పటికే గృహ నిర్మాణ రంగంలో అనేక మందికి వృత్తి శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా మోటార్ సైకిళ్ల రిపేరింగ్‌లో ప్రత్యేకంగా వృత్తి శిక్షణ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సుల్లో దీనిపై ప్రత్యేక కోర్సును ఏర్పాటు చేయాలి. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేర్చుకునే అవకాశం ఉంటుంది. సర్టిఫికెట్ల ఆధారంగా ఆయా మోటార్ సైకిళ్ల కంపెనీల్లో ఉపాధి పొందే వీలుంటుంది. ఆసక్తి ఉన్నవారు బ్యాంకు రుణాలతో షాపులు ఏర్పాటు చేసుకుంటారు.

– స్వయంభారపు వీరభద్రరావు, కౌన్సిలర్, సామర్లకోట

హెల్పర్లు లేకపోతే కష్టం



గత 30 ఏళ్లుగా మోటార్ సైకిలు మెకానిక్‌గా పని చేస్తున్నాను. మోటార్ సైకిళ్ల రిపేరింగ్ షాపుల్లో హెల్పర్లు లేకపోతే దుకాణాల నిర్వహణ కష్టంగా ఉంటుంది. గతంలో అనేక మంది మోటార్ సైకిలు రిపేరింగ్ నేర్చుకోవడానికి వచ్చేవారు. బాల కార్మికుల పేరుతో అనేక మందిపై కేసులు పెట్టారు. ఇప్పటికీ అనేక మంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 60 ఏళ్లు దాటితే మోటార్ సైకిలు రిపేర్లు చేయలేం.

– గల్లా సూర్యప్రకాష్, మోటార్ సైకిల్ మెకానిక్, సామర్లకోట

రేపు ఒలింపిక్ రన్

సామర్లకోట: ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 గంటలకు ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తాళ్లూరి వైకుంఠం, కొండపల్లి శ్రీనివాసు తెలిపారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్ వరకు రన్ జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

సామర్లకోట: రెవెన్యూ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో పని చేసిన విశ్రాంత సీనియర్ ఉద్యోగులను, 75 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ కార్యాలయంలో సత్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.